# పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేత



కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్, జనవరి 4 : ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కేశవరెడ్డి గార్డెన్స్‌లో తహసీల్దార్ ముంతాజ్ అధ్యక్షతన నిర్వహించిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే ధ్యేయమని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకెళ్లాలని పేర్కొన్నారు. ఎన్నికలప్పుడే నాయకులు రాజకీయాలు చేయాలని అనంతరం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేయాలన్నారు. అనంతరం కడ్తాల్ మండలంలో 35, తలకొండపల్లి మండలంలో 70, ఆమనగల్లు మండలంలో 11 మంది లబ్ధిదారులకు చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జడ్పీటీసీ దశరథ్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, వైస్ ఎంపీపీ ఆనంద్, తహసీల్దార్లు ముంతాజ్, రంగారెడ్డి, లలిత, ఎంపీడీవో రామకృష్ణ, డీటీ వినోద్‌కుమార్, సీఐ శివప్రసాద్, ఎస్ఐ హరిశంకర్‌గౌడ్, సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, తులసీరాంనాయక్, సులోచన, కమ్లీ, భారతమ్మ, శంకర్, రాములునాయక్, హంశ్యా, శ్యాంసుందర్‌రెడ్డి, కుమార్, ఎంపీటీసీలు గోపాల్, లచ్చిరాంనాయక్, శ్రీనివాస్‌రెడ్డి, రాములుగౌడ్, మంజుల, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## రైతులు అధిక దిగుబడులు సాధించాలి



కొత్తిమీర పంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి తులసి, పక్కన వ్యవసాయ విస్తరణాధికారి స్వాతిప్రియ

చేవెళ్ల రూరల్, జనవరి 4 : రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి, తెగుళ్లు సోకకుండా పంటలు పండించాలని మండల వ్యవసాయ అధికారి తులసి అన్నారు. చేవెళ్ల మండల పరిధిలోని పామెన గ్రామంలో గురువారం పర్యటించి పంటలు పరిశీలించారు. రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలతో పంటలు పండించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. ఏవో వెంట వ్యవసాయ విస్తరణాధికారి స్వాతిప్రియ, రైతులు ఉన్నారు.

## యువకులు క్రీడల్లో రాణించాలి



టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న సీఐ శివప్రసాద్ తదితరులు

కడ్తాల్, జనవరి 4 : యువకులు, విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సీఐ శివప్రసాద్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో యువజన సంఘాల ఐక్య వేదిక-వివేకానంద యూత్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన, మండల స్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో రాఘవేందర్, వెంకటేశ్, చెన్నయ్య, యాదగిరి, దాసు, కుమార్, మురళి, అంజి, వేణు, మధు, నరేశ్, అనిల్‌గౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## షీటీంపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీటీం ప్రతినిధులు

పెద్దఅంబర్‌పేట, జనవరి 4: షీటీంలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వనస్థలిపురం షీటీం ఇన్‌చార్జి ఏఎస్ఐ జ్యోతి అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు షీటీం, డయల్ 100, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల చిన్నతనంలోనే జీవితాలు నాశనం అవుతాయని తెలిపారు. సమావేశంలో హెచ్‌ఎం ప్రభాకర్, ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, సూర్యకళ, లక్ష్మీనాయక్, షీటీం సభ్యులు పర్వీన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## సాహస క్రీడలతో ఆత్మస్థైర్యం

షాద్‌నగర్‌టౌన్, జనవరి 04: కేంద్ర ప్రభుత్వం కేంద్ర వయోజన, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో హిమాచల్ ప్రదేశ్ హిమాలయాల్లోని దూలదార్ రేంజ్‌లో జరుగుతున్న సాహస క్రీడల్లో షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ధైర్య సాహసాలను ప్రదర్శిస్తున్నారని (నేషనల్ అడ్వెంచర్ క్యాంపు) కంటింజెంట్ లీడర్ షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి గురువారం తెలిపారు. ట్రెక్కింగ్ కార్యక్రమంలో భాగంగా తనతో పాటు పాలమూరు విశ్వవిద్యాలయ పరిధిలోని ఎన్ఎస్ఎస్ విద్యార్థులు రివర్ క్రాసింగ్‌లో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. సుమారు 60పీట్ల వెడల్పు ఉన్న రివర్‌పై శిక్షణ ఇచ్చారని తెలిపారు. దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన 35 మంది విద్యార్థులు ఈ శిక్షణలో పాల్గొన్నాంటున్నారని తెలిపారు. శిక్షణ విజయవంతంగా పూర్తి చేస్తున్న కంటింజెంట్ లీడర్‌ను, విద్యార్థులను తెలంగాణ రాష్ట్ర రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ, విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ అభినందించినట్లు తెలిపారు.

# కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు



పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న రఘునందన్

పెద్దఅంబర్‌పేట, జనవరి 4: పదో తరగతి విద్యార్థులు ప్రణాళికతో కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధ్యమని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ అన్నారు. గురువారం పెద్దఅంబర్‌పేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో బియ్యాన్ని తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన తయారీ కార్మికులకు పలు సూచనలు చేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివి తల్లిదండ్రులతోపాటు పాఠశాలకు పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలోనూ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామచంద్రారెడ్డి, టీచర్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## రైతు కుటుంబానికి రూ. 25వేల సాయం

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 4 :సహకార సంఘంలో సభ్యులైన రైతులు మరణిస్తే సహకార సంఘం ద్వారా రూ. 25వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. కుత్బుల్లాపూర్ గ్రామానికి చెందిన బైరగోని శంకరమ్మ గత నెల 6న మృతి చెందారు. ఆమె భర్త రంగయ్యకు మండల కేంద్రంలోని సంఘం ప్రధాన కార్యాలయంలో గురువారం రూ. 25వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బాటసింగారం రైతు సేవా సహకార సంఘం చైర్మన్ విఠల్‌రెడ్డి అన్నారు. డైరక్టర్లు రాములు, కందాడి మహిపాల్‌రెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ సర్పంచ్ కిరణ్‌కుమార్‌గౌడ్, మేనేజర్ బలేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

## రామ మందిర అక్షింతల వితరణ

తుర్కయంజాల్, జనవరి 4 : అయోధ్య నుంచి తీసుకువచ్చిన రామ మందిర అక్షింతలను గురువారం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో ఊరేగింపు నిర్వహించి ఇంటింటికీ అందజేశారు. కార్యక్రమంలో బచ్చిగళ్ల రమేశ్, సంఘాల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## విద్యార్థులు కష్టపడి చదవాలి

మంచాల, జనవరి 4 : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవటం కోసం కష్టపడి చదవాలని జడ్పీటీసీ మర్రి నిత్య అన్నారు. ఎంఎన్ఆర్ యువసేన నాయకుడు గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం పరీక్షప్యాడ్లను అందజేశారు. త్వరలో ఫ్రీ స్టడీ మెటీరియల్స్ అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ హుండీ లెక్కింపు

కడ్తాల్, జనవరి 4 : తలకొండపల్లి మండలంలోని రాంపూర్ గ్రామంలో గల లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను డిసెంబర్ నెలలో నిర్వహించడం ఆనవాయితీ. ఈ యేడు నిర్వహించిన ఉత్సవాల్లో పెద్ద ఎత్తున స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. బ్రహ్మోత్సవాలు ముగియడంతో గురువారం ఆలయ ఈవో సమక్షంలో ఆలయ హుండీలను లెక్కించారు. రూ.48,117 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రవి, సర్పంచ్ శ్యాంసుందర్‌రెడ్డి, దేవాదాయశాఖ అధికారులు దేవేందర్‌రెడ్డి, చంద్రయ్య పాల్గొన్నారు.

## మైనర్లతో పని చేయిస్తున్న వ్యక్తులపై కేసు

శంకర్‌పల్లి, జనవరి 4 : మైనర్లతో పని చేయిస్తున్న వ్యక్తులపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో రాఘవేందర్ అనే వ్యక్తి బాలుడితో బిల్డింగ్ పనిలో లేబర్‌గా, శ్రీశైలం అనే వ్యక్తి బాలుడితో వెల్డింగ్ పని చేయిస్తున్నారు. విషయం తెలుసుకున్న జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ పిల్లలను అక్కడి నుంచి వదలించి, పని చేయిస్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## మోకిల సీఐగా వీరబాబు



సీఐ వీరబాబు

శంకర్‌పల్లి, జనవరి 4 : మోకిల సీఐగా వీరబాబును నియమిస్తూ సైబరాబాద్ కమిషనర్ అవినాశ్ మహంతి ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పని చేసిన సీఐ నరేశ్‌పై అవినీతి ఆరోపణలు రావడంతో సైబరాబాద్‌కు అటాచ్ చేశారు. సీసీఎస్ శంషాబాద్‌లో పనిచేస్తున్న వీరబాబును మోకిలకు సీఐగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## ఎంపీ రంజిత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన నేతలు

చేవెళ్ల రూరల్, జనవరి 4 : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ రంజిత్‌రెడ్డిని స్థానిక బీఆర్ఎస్ నేతలు గురువారం నగరంలోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానికంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు కార్యక్రమంలో వనం లక్ష్మీకాంత్‌రెడ్డి, విక్రం గౌడ్ పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరించాలని వినతి

షాద్‌నగర్‌రూరల్, జనవరి 4 : ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సామాజికవేత్త శ్యామ్‌సుందర్ కోరారు. ఈ మేరకు గురువారం ఇంటర్ బోర్డ్ కమిషనర్ శృతిఓజాను హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. కొన్ని రోజులుగా కళాశాలలో నెలకొన్న సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కళాశాలను సందర్శించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారని తెలిపారు.

## వేతనాలు చెల్లించాలని..

మొయినాబాద్, జనవరి 4 : ధరణి కంప్యూటర్ ఆపరేటర్లకు వేతనాలు చెల్లించాలని గురువారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా వ్యాప్తంగా సుమారుగా 713 మంది ఆపరేటర్లు పని చేస్తున్నట్లు తెలిపారు. కొద్ది నెలల నుంచి తమకు వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ భూమిని సంరక్షించాలని..

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 4 : కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని బైండ్ల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నందిగామ వెంకటేశ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ రవీందర్‌దత్తుకు గురువారం వినతిపత్రం అందజేశారు. మునుగనూరు సర్వే నెం 83లో తెలంగాణ రాష్ట్ర నిరుపేద దళిత బైండ్ల కులస్తులకు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జ్ఞానకేంద్రానికి జీవో నెం 75 ప్రకారం గతంలో ప్రభుత్వం 20 గుంటల స్థలాన్ని కేటాయించిందని తెలిపారు. అదే సర్వేనంబర్‌లో 6 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కుందేటి కిష్టయ్య, భార్య పోచమ్మ, కుమారులు ఆనంద్, శివలు కబ్జా చేసి సాగు చేసుకుంటున్నారని వివరించారు. తమకు కేటాయించిన స్థలాన్ని కూడా కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

## దాడి ఘటనలో కేసు నమోదు

కొత్తూరు, జనవరి 4: జమ్మికుంట మున్సిపల్ చైర్మన్‌పై దాడి కేసులో పలువురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ శ్రీనివాసులు వివరాల ప్రకారం.. మండలంలోని ఇన్ముల్‌నర్వలో దర్గాకు వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న ఆసిఫ్ చికెన్ సెంటర్ వద్దకు గురువారం కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కెళ్లపల్లి రాజేశ్వర్‌రావు, బీఆర్ఎస్ మైనార్టీ నాయకుడు మహమద్ జాని, తక్కళ్లపల్లి సత్యనారాయణ వచ్చారు. అక్కడే ఉన్న మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, ఆసిఫ్, ఎండీ రవూఫ్, ఫయాజ్, వసీమ్, పాషా, రియాజ్ ఇక్కడికి ఎందుకు వచ్చారని నిలదీశారు. తాము తమ కౌన్సిలర్లను వెతుక్కుంటూ వచ్చామని వారు చెప్పారు. అనుమానాస్పదంగా ఎందుకు తిరుగుతున్నారని వారిపై దాడి చేశారు. ఈ మేరకు రాజేశ్వర్‌రావు, మహమద్ జాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దరాప్తు చేస్తున్నారు.